



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 9 సంచిక : 350 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 20 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :350 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 20 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి
- అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు.మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక

- మిగతా 2లో


## మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్య
- మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రామయ్య
- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు లోకేశ్‌కు కృతజ్ఞతలు
- కూటమి విజయాలను మండలిలో వినిపించాలని సూచించిన మంత్రి



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు

- మిగతా 2లో



## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

### అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం
- సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి,

- మిగతా 2లో

# ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు.


వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి



పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫొటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లతో

- మిగతా 2లో



## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

పెన్ పవర్ డెస్క్: త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి ప్రకటించారు.

- మిగతా 2లో



## బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

- ఈడీ విచారణకు హాజరైన నటి నిధి అగర్వాల్
- బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో విచారణ
- హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- ఇప్పటికే పలువురు నటులను ప్రశ్నించిన ఈడీ

- మిగతా 2లో



## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో భేటీ, లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ సమావేశం

- మిగతా 2లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

- మిగతా 2లో

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు



పెన్ పవర్ డెస్క్: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమ ల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుప డిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి

- మిగతా 2లో

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..




పెన్ పవర్ డెస్క్: మేయర్, మున్సిపల్ చైర్మెన్ ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది ఏపీ అసెంబ్లీ. బుధవారం ( ఆగస్టు 19 ) సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు మంత్రి నారాయణ. ప్రస్తుతం మేయర్,

- మిగతా 2లో



## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నాగబాబుకు పదవి... పవన్ ఇక మారేట్లులేరుగా?

జనసేనలో ఏ పదవి అయినా నేతలు ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ వారి ఆశలు మాత్రం అడుగంటుతూనే ఉన్నాయి. పవన్ కల్యాణ్ తన కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జెండా మోసిన వారిని పట్టించుకోవడం లేదన్న విమర్శలకు మరింత బలం చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా 'ఏపీ గ్రీన్' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబు పదవిని కేటాయించింది. కేబినెట్ ర్యాంకు పదవి. నామినేటెడ్ పోస్టు. అన్నింటా సామాజికన్యాయం, తనకు కులం, కుటుంబంతో సంబంధం లేదని పదే పదే చెప్పే పవన్ కల్యాణ్ పదవుల విషయానికి వచ్చేసరికి తనకే ప్రయారిటీ ఇవ్వడాన్ని ప్రశ్నించలేకపోతున్నారు కానీ, సోషల్ మీడియాలో మాత్రం ఈ నిర్ణయం పై వ్యతిరేకత తీవ్రంగానే కనిపిస్తుంది.

**మంత్రివర్గంలో చోటు దక్కుతుందని...**

నాగబాబుకు మంత్రివర్గంలో పూర్తి స్థాయి బెర్త్ లభిస్తుందని భావించారు. తమకు నామినేటెడ్ పోస్టు దక్కుతాయని జనసేన క్యాడర్ మరియు నేతల్లో ఈ నిర్ణయం కొంత నిరుత్సాహానికి, చర్చకు దారితీసింది. ఏపీ సైంటిఫిక్ అండ్ ఎకోలాజికల్ గ్రీనింగ్, రీఫారేస్టేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా నియమించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న అటవీ మరియు పర్యావరణ శాఖ పరిధిలోనే ఈ నియామకం జరిగింది.జనసేన వర్గాల్లో చర్చ మాత్రం మొదలయింది. అసలు తమకు ఎప్పటికైనా పదవి లభిస్తుందా? అన్న అనుమానాలు వారిలో కనిపిస్తున్నాయి. నాగబాబు హైదరాబాద్ లోనే ఎక్కువగా ఉంటారు. పార్టీ కోసం ఆయన పడిన దానికంటే రెట్టింపు కష్టపడిన వారు అనేక మంది జనసేనే నేతలు ఉన్నారు. తమ ఆస్తిపాస్తులను కూడా పోగొట్టుకున్నారు.

**ప్రత్యేకత ఏంటి?**

ఎన్నికల నుంచి పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రివర్గంలో ప్రత్యక్ష స్థానం దక్కుతుందని అందరూ భావించారు. కానీ కేబినెట్ లో చోటు లభించలేదు. ఇది మంత్రి పదవి కాకపోవడంతో ఆ పదవి వేరే వారికి ఇవ్వవచ్చు కదా?అన్న ప్రశ్న తలెత్తుతుంది. నాగబాబు ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయనకు అదనంగా ఈ పదవి ఎందుకు అన్న ప్రశ్న సహజంగానే జనసైనికుల్లో ఎదురవుతుంది. నిజానికి నాగబాబు వల్ల పార్టీకి ప్రత్యేకంగా ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, పవన్ కున్న క్రేజ్, ఇమేజ్ ఆయనకు లేదని, అటువంటి నాగబాబుకు పదవి ఇవ్వడం ఏంటని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కానీ పవన్ తాను చేసిందే శాసనం.. చెప్పిందే చట్టం అని వ్యవహరిస్తున్నారని, ఈ నిర్ణయాల వల్ల జనసేనకు రాజకీయంగా నష్టం జరుగుతుందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే పవన్ కళ్యాణ్ తన సొంత అన్నకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వకుండా, పాలనాపరమైన కార్పొరేషన్ పదవితో సరిపెట్టడం ద్వారా రాజకీయ విమర్శలకు తావులేకుండా ఉండే వ్యూహాత్మక నిర్ణయంగా పరిశీలకులు భావిస్తున్నారు.

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు

- మొదటి పేజి తరువాయి

వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు."రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది.

**రూపారెడ్డి**

నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.
సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు.వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు.జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా,
మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.
గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు.
ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు

# మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ

- మొదటి పేజి తరువాయి

శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వర్ల రామయ్య, అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మంత్రి లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేశ్‌కు వర్ల రామయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరువురు నేతలు కాసేపు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శాసనమండలిలో కూటమి ప్రభుత్వ విజయాలను, ప్రజా అనుకూల విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వర్ల రామయ్యకు సూచించారు. సభలో ప్రజా సమస్యలపై తమ వాణిని బలంగా వినిపించాలని కోరారు. వర్ల రామయ్య వంటి అనుభవజ్ఞుడి సేవలు మండలికి ఎంతో అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి
"సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సీట్లు కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.గతంలో 2007లో "హాథీ నహీ గణేశ్ హై.. బ్రహ్మ, విష్ణు, మహేశ్ హై" అనే వినూత్న నినాదంతో బీఎస్పీ 206 స్థానాలను కైవసం చేసుకుని, 30 శాతం ఓట్ షేర్‌తో అధికార పీఠాన్ని అధిష్ఠించింది. అయితే, ఆ తదుపరి ఎన్నికల్లో పార్టీ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానానికి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా స్థానాలకు పార్టీ పరిమితమైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుమారు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండగా, మాయావతి అనుసరిస్తున్న ఈ పాత ఫార్ములా ఆమెకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అనేది వేచి చూడాలి.

# భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.
ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి

- మొదటి పేజి తరువాయి

కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు.
వివరాల్లోకి వెళితే.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫొటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫొటోలు తీశారు. తాను తీసిన ఫొటోలను తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి. ప్రతి చిత్రం రాబోయే తరాల కోసం కాలంలోని ఒక భాగాన్ని భద్రపరుస్తుంది. స్ఫూర్తినిచ్చే క్షణాలను బంధిస్తూ ఫొటోగ్రఫీ కమ్యూనిటీ ముందుకు సాగాలి" అంటూ చంద్రబాబు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

- మొదటి పేజి తరువాయి

బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుక వినిపించేందుకు కొత్త పార్టీ స్థాపిస్తానని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం లేకుండా దేశం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు.

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..

- మొదటి పేజి తరువాయి

మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న క్రమంలో ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది ప్రభుత్వం. ఈ సందర్భంగా సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని... అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని.. 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని అన్నారు నారాయణ. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు మంత్రి నారాయణ.ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్, చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని అన్నారు.
ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.
నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుంది.
రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుంది.
అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం, పనులు వేగవంతం.
నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుంది.
ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.

# బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు.బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు.ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు 19:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడు లో 187వ ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఈశ్వర్ స్టూడియోలో కెమెరా సృష్టి కర్త అయిన దాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షులు సలాది కృష్ణ మాట్లాడుతూ రాష్టంలో నాలుగులక్షలమందికి జీవనోపాధిబిక్ష కల్పించిన మహనీయులు దాగురే అని ఆయన సేవలను కృష్ణ కొనియాడారు ఈ కార్యక్రమం లో అధ్యక్షులు సలాది కృష్ణ,
నూలు బాబు, చెవల శ్రీను,సలాది లోకేష్ తదితరులు పాల్గొన్నారు

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి

- ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కాలపరిమితితో కార్యాచరణ
- ఆగస్టు 22లోగా ఇంటింటి ఓటర్ల సర్వే పూర్తి చేయాలి
- సెప్టెంబర్ 7 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రకటించాలి

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 19:** త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక ఎన్నికలకు పకడ్బందీగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఓటర్ల జాబితాల రూపకల్పన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, తనిఖీ, మౌలిక వసతుల కల్పన తదితర ఎన్నికల సన్నద్ధత కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునీత, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డా. ఏ. మల్లికార్జున,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనరేట్ డైరెక్టర్ పి. సంపత్ కుమార్ సూచించారు.

అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారులు స్థానిక సంస్థలు, పురపాలక ఎన్నికల సన్నద్ధతపై కాలపరిమితితో కూడిన కార్యాచరణను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై పలు కీలక సూచనలు చేశారు.

**385 గ్రామ పంచాయతీలు, 5 పురపాలక సంఘాలకు ఎన్నికలు**

కాకినాడ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు, 5 పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.మొదటి దశలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల నమోదు, సంబంధిత వివరాల సేకరణ కోసం ఇంటింటి సర్వే ఆగస్టు 18 నుంచి ప్రారంభమైందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, ఓటర్ల వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.

భవిష్యత్తులో రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపులకు ఓటర్ల జాబితా కీలక ప్రాతిపదికగా ఉంటుందని, అందువల్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాబితాలను రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కుల ధ్రువీకరణ ప్రక్రియలో అవసరమైన సహాయాన్ని రెవెన్యూ శాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోల నుంచి పంచాయతీ కార్యదర్శులు పొందాలని సూచించారు.

**సెప్టెంబర్ 7 నాటికి తుది ఓటర్ల జాబితా**

ఇంటింటి సర్వేను ఆగస్టు 22 నాటికి పూర్తి చేయాలని, ఆగస్టు 23, 24 తేదీల్లో మార్కింగ్ కాపీలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆగస్టు 25న ముసాయిదా ఓటర్ల జాబితాను సంబంధిత పంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాలన్నారు.ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఆగస్టు 26, 27, 28 తేదీల్లో లిఖితపూర్వకంగా స్వీకరించాలి. అందిన అభ్యంతరాలపై ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.సెప్టెంబర్ 3 నుంచి 6 వరకు గ్రామసభల ద్వారా ఓటర్ల జాబితాను చదివి వినిపించి, ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని, సెప్టెంబర్ 7 నాటికి తుది ఓటర్ల జాబితాను ప్రకటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.





ఈ చట్టబద్ధమైన ప్రక్రియను ఎంపీడీవోలు అత్యంత బాధ్యతతో పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి పురోగతిని ప్రతి 2 నుంచి 3 గంటలకు ఒకసారి సమీక్షించాలని ఆదేశించారు.

**4,554 పోలింగ్ కేంద్రాల తనిఖీ**

జిల్లాలో మొత్తం 4,554 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో సుమారు 150 నుంచి 200 వరకు పోలింగ్ కేంద్రాలు ఉండే అవకాశం ఉన్నందున ఎంపీడీవోలు ఆయా కేంద్రాలను స్వయంగా భౌతికంగా పరిశీలించాలని ఆదేశించారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు లేదా అనువైన భవనాలు అందుబాటులో లేని కేంద్రాలకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర కనీస మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.మౌలిక వసతులు లేని కేంద్రాల్లో అవసరమైన సివిల్ పనులకు ఇప్పటి నుంచే ప్రతిపాదనలు రూపొందించి, అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

**ఆగస్టు 31 నాటికి తుది పోలింగ్ కేంద్రాల జాబితా**

ఆగస్టు 21 నాటికి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేసి, ఆగస్టు 23న ప్రచురించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను ఆగస్టు 26లోపు స్వీకరించి, సమగ్ర పరిశీలన అనంతరం ఆగస్టు 31 నాటికి తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులు, సిబ్బందికి సాధారణ సెలవులు మంజూరు చేయబోమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత సున్నితమైనదని, చట్టబద్ధమైనదని పేర్కొంటూ ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలి**


ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సన్నద్ధత కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.


కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు, సిబ్బందికి ఎన్నికల విధులు, నిబంధనలు, ప్రక్రియలపై త్వరలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశంలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమన్వయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మురికి నీటితో ముప్పు.. అధ్వానంగా నీలాద్రిరావుపేట రహదారులు









- చినుకు పడితే చాలు.. బురదమయం
- గుంతల్లో నిలిచిపోతున్న వర్షపు నీరు.. పొంగిపొర్లుతున్న మురుగు కాలువలు
- అంటువ్యాధుల భయంతో గ్రామస్తుల ఆందోళన.. అధికారుల తీరుపై విమర్శలు

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 19:**

చినుకు పడితే చాలు.. రహదారులు బురదమయంగా మారుతున్నాయి. మురుగు కాలువలు పొంగిపొర్లడంతో రోడ్లపై మురికి నీరు చేరుతోంది. దీంతో వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి నీరు నిలిచిపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని నీలాద్రిరావుపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, పటిష్టతకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని ప్రాంతాల్లో పనులు నాణ్యతకు తూతూమంత్రంగా సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అలసత్వమా.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా అన్నది తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**గుంతలమయంగా ప్రధాన రహదారి**

16వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న నీలాద్రిరావుపేట గ్రామపంచాయతీలో పలుచోట్ల రహదారులు అధ్వానంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారి నుంచి గాంధీబొమ్మ రోడ్డుకు వెళ్లే మార్గంలో గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోతోందని వాపోతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మురుగు కాలువలు పొంగిపొర్లడంతో ఇక్కట్లు**

వర్షాలు కురిసిన సమయంలో మురుగు కాలువలు పొంగిపొర్లి మురికి నీరు రోడ్లపైకి వస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా హరిజనపేట రామాలయం వీధి మురికికూపంగా మారుతోందని పేర్కొంటున్నారు. రోడ్లపై రోజుల తరబడి మురికి నీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అంటువ్యాధుల భయం**

మురుగు నీరు, బురద కారణంగా గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామంలోని రహదారులు, మురుగు కాలువల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి గుంతలను పూడ్చి, నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువలను శుభ్రం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భాషతో పనిలేకుండా ప్రపంచాన్ని ఏకం చేసే ఏకైక కళ ఫోటోగ్రఫీ

**ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవంలో డా. అడ్డాల సత్యనారాయణ**

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 19:** భావాన్ని వ్యక్తీకరించడానికి భాషతో పనిలేకుండా ప్రపంచాన్ని ఏకం చేసే ఏకైక కళ ఫోటోగ్రఫీ అని ప్రముఖ దంత వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సర్పవరం జంక్షన్‌లోని జస్వంత్ స్టూడియోలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ ఫోటోగ్రఫర్స్ సంఘం అధ్యక్షుడు వీర్రాజు మాట్లాడుతూ 1839లో ఫ్రెంచ్ ప్రభుత్వం 'డాగ్యురోటైప్' అనే తొలి ఆచరణాత్మక ఫోటోగ్రఫీ ప్రక్రియను అధికారికంగా ప్రపంచానికి పరిచయం చేసిందని తెలిపారు. దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫోటోగ్రఫీ కళ, శాస్త్రంతో పాటు దాని వెనుక ఉన్న ఫోటోగ్రాఫర్ల ప్రతిభను గుర్తించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశమన్నారు.



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనే పదం గ్రీకు భాష నుంచి వచ్చిందని, 'ఫోటో' అంటే కాంతి, 'గ్రాఫి' అంటే రాయడం లేదా చిత్రీకరించడం అని వివరించారు. ఒక చిత్రం వేయి పదాల కంటే శక్తివంతమైనదని అన్నారు. భావోద్వేగాలు, చారిత్రక ఘట్టాలు, అందమైన జ్ఞాపకాలను కాలంలో బంధించి తరతరాలకు అందించే అద్భుతమైన మాధ్యమం ఫోటోగ్రఫీ అని పేర్కొన్నారు. భాషతో సంబంధం లేకుండా భావాలను వ్యక్తీకరించగల ఫోటోగ్రఫీ ప్రపంచ ప్రజలను అనుసంధానించే శక్తివంతమైన కళ అని అన్నారు.ఈ కార్యక్రమంలో బాబూరావు, జస్వంత్ శ్రీనివాస్, మనోహర్, రవి, మోహన్, రాము, గంగాధర్, శివాజీ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 187 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 19:**మండల ఫోటో గ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 187 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.

మండలం ఫోటోగ్రాఫర్స్ ఉ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ద్విచక్ర వాహనాపై సంఘ జెండా తో ర్యాలీ నిర్వహించారు. ఫోటో గ్రఫీ సృష్టి కర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అంబాజీపేట ఏఎస్ఐ కుడిపూడి గోపి జెండా ఆవిష్కరణ చేసారు. అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్ సామా వీర వెంకట సత్యనారాయణ ను సన్మానం చేసారు. ఈ సందర్భంలో ఏఎస్ఐ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్ తీపి గుర్తులు నవ్వులను అందరికీ గుర్తుండిపోయే విధంగా ఫొటోస్ ఇస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గంటా వెంకటగిరి,
అధ్యక్షులు యనమదల వెంకటరమణమూర్తి, సెక్రటరీ పిల్లి ప్రతాప్, కే. శామ్, సి.హెచ్. వెంకటేష్, ఎం. రాము, ఎన్ వినోద్, అమలాపురం మణికంత ల్యాబ్ అధినేత ధనరాజ్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహం





**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 19 :**
ప్రభుత్వ హైస్కూళ్లలో చదివి పదో తరగతి పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన గీత కులాలకు చెందిన మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు అనగాని సత్యప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.25 లక్షల నగదును అందించారు.శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు సూచన, సిఫార్సుతో కొత్తపేటకు చెందిన దొంగ శ్రీనివాసరావు కుమార్తె దొంగ పూజిత, గుబ్బల రామకృష్ణ కుమార్తె గుబ్బల దుర్గా ప్రియాంకలకు ఈ ప్రోత్సాహకం లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులు రూ.20 వేల చొప్పున నగదు బహుమతులు అందుకున్నారు.విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ఈ నగదు ఎంతగానో ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ చైర్మన్ కుడుపూడి సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.కొత్తపేట విద్యార్థులు పూజిత, దుర్గా ప్రియాంకలను గుబ్బల మూర్తి, దంగేటి చంటి, గుబ్బల వెంకటరమణ, మట్ట బాలు, గుబ్బల సుబ్రహ్మణ్యం తదితరులు తఅభినందించారు. విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# ఏఐ యుగంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన

**గండేపల్లి, పెన్ పవర్(సూరంపాలెం), ఆగస్టు 19:** సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో ఏఐ యుగంలో సైబర్ సెక్యూరిటీపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థలో ఇన్ఫర్మేషన్ ప్రొటెక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ చైతన్య ఎమాని రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడిందని ఆయన వివరించారు. ఏఐ ఆధారిత సాంకేతికతలను సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నప్పటికీ, అదే సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సైబర్ దాడులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్) డాక్టర్ ఎ. రమేష్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, అసోసియేట్ డీన్ స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ డాక్టర్ ఎం.వి.



రాజేష్, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ కొవ్వూరి ఎన్. భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి





**గండేపల్లి పెన్ పవర్,(సూరంపాలెం) ఆగస్టు 19:** విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించేందుకు ప్రగతి యూనివర్సిటీలో పరిశ్రమ ఆధారిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రభుత్వ ధృవీకృత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)--3డీ ప్రింటింగ్ ప్రోగ్రామ్స్, జీపీయూ ప్రోగ్రామింగ్ స్పెషలైజేషన్ ఇంటర్న్‌షిప్, నాస్కామ్ ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ ప్రభుత్వ ప్రాయోజిత అసెస్‌మెంట్ ప్రోగ్రామ్లను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జి. నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.


కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డి.వి. మంజుల అతిథులను పరిచయం చేశారు. సిఎస్సి ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్--అకడమిక్ అండ్ స్ట్రాటజిక్ అలయన్స్ శ్రీ తెన్నేటి అప్పల నరసింహం విద్యార్థులకు ఆధునిక సాంకేతికతలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అవసరాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమాలను సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రగతి యూనివర్సిటీ ఎస్‌పీఓసీ డాక్టర్ ఎ. అవినాష్, సిఎస్సి ఇండియా అసోసియేట్ డైరెక్టర్ శ్రీ వై. రామ్మోహన్ రావు సహకారంతో సమన్వయం చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రస్తుత సాంకేతిక రంగంలో అవసరమైన ప్రాయోగిక పరిజ్ఞానం, పరిశ్రమ అనుభవం లభించడంతో పాటు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు మరింతగా సిద్ధమయ్యే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం







**గండేపల్లి, పెన్ పవర్, (సూరంపాలెం) ఆగస్టు 19:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చీఫ్ అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ శివ ప్రకాష్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య యూనివర్సిటీని ఎంపిక చేసుకుని తమ సంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు విద్యా విధానం ఒక రకంగా ఉంటే, సాంకేతిక విద్యా విధానం అందుకు భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టత సాధించేలా తల్లిదండ్రులు సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తరచూ యూనివర్సిటీకి వచ్చి అధ్యాపకులతో చర్చిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సహకరించాలని కోరారు.

బీటెక్ నాలుగేళ్ల విద్యార్థి జీవితం భవిష్యత్‌ను నిర్ణయించే కీలక దశ అని ఆయన అన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని, శ్రమను గుర్తించి విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి వారి కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది ఇద్దరు విద్యార్థులు రికార్డు స్థాయిలో రూ.1.06 కోట్ల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గత రెండేళ్లుగా 95 శాతానికి పైగా ఆదిత్య విద్యార్థులు వివిధ ప్రముఖ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. ప్రత్యేక ప్లేస్‌మెంట్ శిక్షణ, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ ఇందుకు ప్రధాన కారణమని వివరించారు.

డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి తరగతికి తప్పనిసరిగా హాజరవుతూ యూనివర్సిటీ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ల్యాబ్, లైబ్రరీలను సద్వినియోగం చేసుకుని అధ్యాపకులు బోధించే అంశాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

చీఫ్ అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ శివ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థిగా తమ కర్తవ్యాన్ని తెలుసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ ఎస్. రమాశ్రీ, డాక్టర్ తంగజమ్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్‌పై బీసీల హర్షం

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**కొత్తపేట,పెన్ పవర్, ఆగస్టు 18,:** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కొత్తపేట మండల బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ నిర్ణయం సామాజిక, రాజకీయంగా బీసీల అభ్యున్నతికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.



ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు అనేక రాజకీయ పదవులను కోల్పోయారని ఆరోపించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించడం ద్వారా గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని తాజాగా నెరవేర్చిందని తెలిపారు. నిన్న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 34 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపడం ద్వారా ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకుందని అన్నారు.బీసీలకు రాజకీయంగా ప్రాతినిధ్యం పెరిగినప్పుడే సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని నాయకులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలుతో గ్రామీణ స్థాయి నుంచి బీసీ నాయకత్వం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కృషి చేస్తుందని ఈ నిర్ణయంతో మరోసారి స్పష్టమైందన్నారు.

బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి రామకృష్ణ, మోడేకుర్రు సొసైటీ అధ్యక్షులు బొక్క వెంకట కుమార్, మాజీ సర్పంచ్‌లు జక్కంశెట్టి చంటి, కుడుపూడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఆదినారాయణ, గుబ్బల మూర్తి, గుత్తుల సత్యనారాయణ, జక్కంశెట్టి శ్రీనివాస్, మట్ట బాలు, దూనబోయిన ప్రదీప్, చిట్టూరి శ్రీనివాస్, బొక్క రామకృష్ణ, కుడుపూడి శ్రీనివాసరావు, చిట్టూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ రంగం అభివృద్ధికి ఫోటోగ్రాఫర్ల సేవలు కీలకం





ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో వక్తలు

కొత్తపేట,పెన్ పవర్, ఆగస్టు 19:

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండల ది ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గంధం పెద్దిరాజు నేతృత్వంలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కొత్తపేట పాత బస్టాండ్ వద్దకు ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ర్యాలీగా చేరుకుని ఫోటోగ్రఫీ ఐక్యత, ప్రాధాన్యతను చాటారు.అనంతరం ఫోటోగ్రఫీ రంగానికి ఆద్యుడైన లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు నామాల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, భాస్కర్, బంగార్రాజు, యెలిశెట్టి ప్రభాకర్ తదితరులు తమ సుదీర్ఘ అనుభవాలను పంచుకున్నారు.

లిచరిత్రను భద్రపరిచే వృత్తి

ఫోటోగ్రాఫర్ కేవలం చిత్రాన్ని తీసే వ్యక్తి మాత్రమే కాదని, ఒక సంఘటనను భవిష్యత్ తరాలకు అందించే చరిత్రకారుడని వక్తలు పేర్కొన్నారు. పుట్టినరోజు నుంచి వివాహం వరకు, సామాజిక కార్యక్రమాల నుంచి ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ, సాంస్కృతిక, ప్రజా ఉద్యమాల వరకు ప్రతి కీలక ఘట్టాన్ని కెమెరాలో బంధించి సమాజానికి అందించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో విశిష్టమైనదన్నారు. ఒక మంచి ఫోటో ఎన్నో మాటలు చెప్పగలదని, సమాజంలో జరిగిన వాస్తవాలను దృశ్యరూపంలో భద్రపరచడం ఫోటోగ్రాఫర్ల ప్రత్యేకత అని తెలిపారు.

లివృత్తిలో ఎన్నో సవాళ్లు

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కెమెరాలు, లెన్స్‌లు, కంప్యూటర్లు, ఎడిటింగ్ పరికరాలపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని ఫోటోగ్రాఫర్లు తెలిపారు. పోటీ పెరగడం, పరికరాల నిర్వహణ ఖర్చులు, విద్యుత్ వ్యయం, ప్రయాణ ఖర్చులు, ఫోటో--వీడియో ఎడిటింగ్‌కు వెచ్చించే సమయం వంటి అంశాలు వృత్తిపరంగా సవాళ్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాలు మాత్రమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లోనూ సమయపాలన లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు.

లిఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రాధాన్యం

ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు వృత్తి భద్రత, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. వృత్తిలో ఉన్నవారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు, వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించే విధంగా సంక్షేమ చర్యలు ఉండాలని ఆకాంక్షించారు. ఫోటోగ్రఫీ రంగాన్ని కేవలం ఉపాధి వృత్తిగా కాకుండా సమాజానికి సేవలందించే వృత్తిగా గుర్తించాలని కోరారు.

అనంతరం వరుసగా 12 నెలలపాటు నిర్వహించిన సమావేశాలకు ఒక్కసారి కూడా గైర్హాజరు కాకుండా హాజరైన సభ్యులను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోనసీమ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గెడ్డం సురేష్ పాల్గొని ఫోటోగ్రాఫర్లను అభినందించారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంధం పెద్దిరాజు, వైస్ ప్రెసిడెంట్ పాలింగి శ్రీను, కార్యదర్శి దూనబోయిన శ్రీను, ట్రెజరర్ యాండ్రా శివ కళ్యాణ్ కుమార్, సభ్యులు రాజశేఖర్, పట్టా రాజు, కొత్త సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అభివృద్ధి, సంక్షేమం నమ్మకంతెలుగుదేశం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 19:**మాచవరం, అంబాజీపేట లలో డోర్ టు డోర్ కార్యక్రమం గణపతి వీర రాఘవులు క్లస్టర్ పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర శెట్టిబజ్జీ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు లు కూటమి ప్రభుత్వం ప్రభుత్వం రెండు సంవత్సరాల చేసిన అభివృద్ధి సంక్షేమాల వివరించడంతో పాటు వారి యొక్క సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చేయుటంతో పాటు ప్రభుత్వం హామీ లో సూపర్ సిక్స్ పథకాలు అమలు వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి శ్యామ్, మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కొల్లూరి దివాకర్, నాయకులు దొమ్మేటి రామారావు, తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య, గుత్తుల సురేష్ కుమార్, కాగితపల్లి సాయిరాం, నేలపూడి సత్యనారాయణ, బచ్చు చినబాబు, యాగన పండు చప్పిడి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు

## గోనేడ వద్ద బెడ్ రెగ్యులేటర్ నిర్మించాలి - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అసెంబ్లీలో డిమాండ్



**పెన్ పవర్ ప్రతినిధి, కాకినాడ (అమరావతి,) ఆగస్టు 19**

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానం తరువాత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మంత్రి ఈమధ్య మా ప్రాంతమంతా పర్యటించారని ఆయన వాస్తవాలు అన్ని చూశారని అన్నారు. 1972 ఏలేరు నిర్మాణం జరిగింది అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఈ కాలువకు సాగునీరు, వరద నీరు పోవడానికి ఒకే కాలువ ఉందని అన్నారు. పూర్వం రిజర్వాయర్ నిర్మాణానికి ముందు తిమ్మాపురం బెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆ రోజుల్లో 65 వేల ఎకరాలకు వంతుల వారి నీళ్లు ఇచ్చే అవకాశం ఉండేదని రిజర్వాయర్ నిర్మాణం తర్వాత 53 వేల ఎకరాలకే నీలిచ్చే పరిస్థితి ఉందని అన్నారు. ఎందుకంటే కొంత ఆయకట్టు తీసుకెళ్లి గోదావరి లోకి కలపడం జరిగిందని అన్నారు. 53 వేల ఎకరాలకు కూడా డి సి ఆర్ మెయిన్ లూయిస్ 600 క్యూసెక్కుల కెపాసిటీతో ఏర్పాటు చేయడం జరిగింది. కానీ 1800 క్యూసెక్కుల నీరు కిందకి వదిలితేనే కానీ ఈ ఆయకట్టు కు నీరు అందే పరిస్థితి లేదని అన్నారు. ఈ పరిస్థితి ఎక్కడ లేదని సిల్వే నుంచే నీరు వదలడం జరుగుతుందని అన్నారు. దీనికి ఫేజ్ వన్ ఆధునికరణ అని గత ప్రభుత్వాలుచాలా డబ్బులు ఖర్చు చేయడం జరిగింది. ఒక రైతుగా నా దృష్టిలో ఒక్క రూపాయి కూడా ఉపయోగ పడలేదని నా అభిప్రాయమని దాని జోలికి ఇప్పుడు పోదలుచుకోలేదని అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న కారణంగా 12 సంవత్సరాలలో రెండు సంవత్సరాల 24 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఏలేరు నిండుతుందని మిగతా అన్ని సంవత్సరాలు 50% రిజర్వాయర్ నీటితో ఉంటుందని మా అందరి అభ్యర్థన మేరకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పురుషోత్తపట్నం పేజ్ 2 ద్వారా 1800 కోట్ల రూపాయల ఖర్చుతో 1400 క్యూసెక్కుల నీటిని పోలవరం కాలవ నుండి ఏలేరు జలాశయంలోకి లిఫ్ట్ చేయడం జరుగుతుందని ఇది వాస్తవమని అన్నారు.వీటన్నిటికంటే నీటిని పొదుపుగా వాడుకోవాలని సూత్రికరణతో 53 వేల ఎకరాలకు 600 క్యూసెక్కుల నీటిని వదిలితే రైతులు రెండు పంటలు పండించుకోవచ్చని అంతేకాకుండా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కి విశాఖపట్నం త్రాగునీరు అవసరాలకు ఎల్ఎంసీ కాలువ ద్వారా నీటిని అందించవచ్చని అన్నారు. ముఖ్యంగా నేను కోరేది ఏమిటంటే 53 వేల ఎకరాలకు 600 క్యూసెక్కుల నీటి తోటి పంటలు పండించుకోవడానికి కాలువలు పరిరక్షించుకోవడానికి మంత్రి గారిని నేను కోరేది ఏమిటంటే గోనేడ వద్ద బెడ్ రెగ్యులేటర్ నిర్మాణం చేసుకోవాలని మూడు కిలోమీటర్లు సాయిల్ చాలా గట్టిగా ఉంటుందని కింద ఆయకట్టు రైతులకు నష్టం ఏమీ ఉండదని కాబట్టి పేజ్ వన్ నిధులతో ఆటోమేటిక్ గేట్లతో గోనేడ వద్ద ఒక రెగ్యులేటర్ నిర్మిస్తే 600 క్యూసెక్కుల ఆయికట్టుకు వెళ్లి రైతులకు నీరు అందుతుందని అన్నారు. ఫేజట? వన్ ఆధునీకరణ నిధులతో ఈ నిర్మాణం చేపట్టి తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండే విధంగా

దీనిపై ఇరిగేషన్ శాఖ మంత్రి యాక్షన్ తీసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అసెంబ్లీలో ప్రస్తావించారు.

## అవార్డు అందుకున్న జిల్లా ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 19:**80 వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖలలో జిల్లా ఉత్తమ ఉద్యోగాలుగా అంబాజీపేట మండలానికి సంబందించిన అవార్డు గ్రహితులను సత్కరించారు. అంబాజీపేట మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విత్తనాల ఇంద్ర శేఖర్ అధ్యక్షతన ఎమ్ పిడివో కార్యాలయం లో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ లో జిల్లా బెస్ట్ ఎంప్లాయ్ గా అవార్డు అందుకున్న తహసీల్దారు బి. చిన్నబాబు, జి. పెద్దిరాజు, ఐ.వి.వి. రమేష్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో దంగేటి రామకృష్ణ , మెడికల్ డిపార్ట్మెంట్ గుత్తుల శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. శ్రీను లను ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర రావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి , సీనియర్ నాయకులు సిఈసి మెంబెర్ పేరి కామేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎం. ఎం. శెట్టి, పేరి శ్రీను, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, వాసంశెట్టి పెదబాబు, దొమ్మేటి సత్యమోహన్, కాండ్రేగుల గోపాలకృష్ణ, విలిసత మంగతాయారు, గంటి శ్రీరామ మూర్తి, కోట విజయరాజు, వదలి కృష్ణమూర్తి, నూకపెయ్యి సత్యనారాయణ, దంగేటి సూర్యనారాయణ, అందే మూర్తి, మద్దింశెట్టి మల్లిబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు,సుధాబత్తుల రాము , కుడుపూడి సత్తిబాబు, కోట బేబీ రాణి, కుసుమ వరలక్ష్మి, కుసుమ విజయకుమారి, యెల్లమెల్లి జయబాబు, మట్టపర్తి యజ్ఞ శ్రీ వెంకటేశ్వరరావు, రాయుడు మీరయ్య, రాయుడు స్వామి, చప్పిడి పండు, పితాని సతీష్, దొంగ హరి, మట్టపర్తి నాగరాజు , బైరశెట్టి సూరిబాబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవులపల్లి రామలింగం మృతి పత్రికా రంగానికి తీరని లోటు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 19:** జర్నలిజం వృత్తికి అంకితమై పనిచేసిన సీనియర్ పాత్రికేయులు, వెలుగు దినపత్రిక సంపాదకులు దేవులపల్లి రామలింగం మృతి పత్రికా రంగానికి తీరని లోటని సీనియర్ రాజకీయ నాయకులు ఎస్.ఎస్ రాంకుమార్ అన్నారు. 1985లో ఆంధ్రభూమి పత్రికలో చేరి అనతి కాలంలోనే, ఉదయం స్టాఫ్ రిపోర్టర్ గా, ఉభయగోదావరి జిల్లాల వార్త బ్యూరో చీఫ్ గా పనిచేసి ఆంధ్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పాత్రికేయ వృత్తిలో బాగా రాణించి పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన ఘనత రామలింగానికే దక్కుదుందున్నారు. 2002లో రాజమహేంద్రవరంలో సొంతంగా వెలుగు దినపత్రికను స్థాపించి అప్పటినుండి సంపాదికుడుగా కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలోనూ ఆయనకు ఆయనేసాటి అన్నారు. సూటిగా మాట్లాడే తత్వం, నిరాడంబర జీవితం, విస్తృత పరిజ్ఞానం, ఆయనకున్న ప్రత్యేకత అన్నారు. అటువంటి వ్యక్తి ఆకస్మిక మృతి చెందడం పత్రికా రంగానికి తీరని లోటని రామ్ కుమార్ అన్నారు. ఆయన కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, తెలియజేయడమే కాకుండా, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. రామలింగం మృతి పట్ల ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్, డి ఎస్ పి,డాక్టర్ దాడి కోటి, కిర్లంపూడి మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, విశ్రాంత ఉద్యోగి పెంటకోట మూర్తి, మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు,చదరం చంటిబాబు, చదరం సత్తిబాబు చదరం చినసత్తిబాబు, పెనగంటి గోవిందు ఆంధ్రభూమి సాయి, సీనియర్ జర్నలిస్ట్ శైలేంద్ర, తోపాటు పలువురు రాములమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేయడమే కాకుండా, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు.

## ఎల్నినో ప్రభావంపై పంటల ప్రణాళిక.....



**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 19:–** అన్నవరం రైతు సేవా కేంద్రశీలో కె రాబర్ట్ పాల్,జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, కాకినాడ , ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు కే జె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తుని సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఐదు మండలాలైన తుని ,శంకవరం ,,తొండంగి , కోటనందూరు మరియు రౌతులపూడి మండలాల వ్యవసాయ అధికారులు మరియు విస్తరణాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఏర్పాటు చేశారు. సూపర్ ఎల్ నినో అనగా బాగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు తుని పరిధిలో ఐదు మండలాల్లో కూడా నెలకొన్న సందర్భంలో వరి సాగుకు తీవ్ర ఆటంకం జరుగుతుందని , అయినప్పటికీ ప్రతి ఎకరా ,ప్రతి సర్వే నెంబర్లలో రైతు ఏదో ఒక పంట వరికి ప్రత్యామ్నాయశీగా ఆరుతడి పంటలు కానీ, పశుగ్రాసశీ కొరకు విత్తనాలు వేసుకోవడం గాని, అలాగే ప్రకృతి వ్యవసాయంలో వివిధ నమూనాలుగానీ ,అలాగే చిరుధాన్యాల సాగు గాని పడేలా సిబ్బంది చూడాలని తెలియజేశారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లోనూ మండలాల వారీగా వరి సాధారణ విస్తీర్ణం లో ఇప్పటి వరకూ వరి ఎంత పడింది, ఇప్పటివరకు ఎంత పడాలి, ఆగస్టు 31,సెప్టెంబర్ మొదటి వారం వరకు ఎంత వరి విస్తీర్ణం పడుతుంది , ఆ తర్వాత పడలేనటువంటి దానికి ప్రతి ఎకరా కూడా ఏ విధంగా మనం ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకెళ్లాలని విషయం మీద అందరికీ దిశా నిర్దేశం చేశారు .

తుని డివిజన్ పరిధిలో వరి బదులుగా ఆరుతడి పంటలుగా సుమారు 17,759 ఎకరాలకు ప్రణాళిక సిద్ధశీ చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ అధికార్లు పద్మశ్రీ,అశోక్ కుమార్, ఈశ్వర రావు, ఏ ఈ ఓ లు దైవ ప్రసాద్, అప్పారావు,శివ కుమారి,శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై రైతులకు సమగ్ర సస్యరక్షణపై శిక్షణ.





బూరుగుపూడిలో పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన.

**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 19:**కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఉద్యాన పంటల్లో సమగ్ర సస్యరక్షణ,మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఉద్యాన అధికారి కె దివ్యశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దాపురం ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి సునీత రైతులకు పలు సూచనలు చేశారు.దొండ పాదుల్లో పిండి నల్లి నివారణ,తీగజాతి కూరగాయల్లో రసం పీల్చే పురుగుల నియంత్రణ,పండు ఈగ నివారణకు లింగాకర్షక ఎరల వినియోగంపై వివరించారు.విత్తన శుద్ధి ద్వారా తెగుళ్ళ,చీడపీడలను ముందుగానే నియంత్రించవచ్చని సూచించారు.తెల్లదోమ ద్వారా వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున రైతులు సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలని,పంట మార్పిడి పాటించాలని సూచించారు.రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవన ఎరువులైన పీఎస్‌బీ,ఆజటోబ్యాక్టర్,కేఆర్‌బీ,ఆజోస్పైరిల్లమ్ వినియోగించడం ద్వారా భూసారం, పంట దిగుబడికి ప్రయోజనం ఉంటుందని డాక్టర్ పి.సునీత వివరించారు.ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న ప్రభుత్వ రాయితీలను ఉద్యాన అధికారి కె దివ్యశ్రీ రైతులకు వివరించారు.తీగజాతి కూరగాయలకు శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ఎకరానికి రూ.లక్ష వరకు రాయితీ, జామ, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్, మామిడి, జీడిమామిడి, పూల సాగుకు ఎంఐడిహెచ్ పథకం కింద రాయితీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగుకు మొక్కలు 100 శాతం రాయితీతో పాటు ఎరువులు,పురుగుమందులు,అంతర పంటలకు ప్రోత్సాహకాలు, వర్మీకంపోస్ట్ యూనిట్ నిర్మాణానికి రాయితీ ఉన్నట్లు వివరించారు. కొబ్బరి,ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతర పంటగా సాగు చేసేందుకు కూడా రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు.బిందు,తుంపర సేద్యానికి ఏపీఎంఐపీ ద్వారా అందించే రాయితీలను వివరించారు.మండల వ్యవసాయ అధికారి ఎన్ సుధా మాధురి మాట్లాడుతూ వరి సాగు చేస్తున్న రైతులు పంటల బీమా ప్రీమియం ఎకరానికి రూ.760 చొప్పున ఆగస్టు 31లోపు చెల్లించుకోవాలని సూచించారు.అనంతరం క్షేత్రస్థాయిలో కూరగాయల పంటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బూరుగుపూడి గ్రామ కూటమి నాయకులు పాటంశెట్టి రవి, కుంచె తాతాజీ, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఎం హరిత, ఏఈఓ మూర్తి,తమ్మారావు,సత్తిబాబు,చిన్నయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పుట్టినరోజు వేడుకలు





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 19:** రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు, వృథా ఖర్చులకు పరిమితం చేయకుండా పేదలు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ సానా సతీష్ బాబు ఇచ్చిన పిలుపు మేరకు ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు.కాకినాడ కొప్పవరంలోని ఎంపీ కార్యాలయంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది దివ్యాంగులకు ప్రత్యేక బహుమతులను పంపిణీ చేశారు. అదేవిధంగా భారీ ఎఊఅన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఎంపీ సానా సతీష్ బాబు పుట్టినరోజు సందర్భంగా కాకినాడకే పరిమితం కాకుండా కాకినాడ, ఏలూరు, కోనసీమ, రాజమహేంద్రవరం, కడప జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అభిమానులు, కార్యకర్తలు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం, నిత్యావసర వస్తువుల పంపిణీ, దివ్యాంగులకు సహాయ కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సేవా కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేల మందికి పైగా దివ్యాంగులు, పేదలు, నిరుపేద కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాలను సామాజిక సేవకు వేదికగా మార్చి సమాజంలోని అవసరమైన వర్గాలకు చేయూతనివ్వాలన్నదే ఎంపీ సానా సతీష్ బాబు ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించాలన్న ఎంపీ సానా సతీష్ బాబు పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగులు, పేదలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అవసరమైన వస్తువులు అందించడం, అన్నదానం చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించగలిగామని చెప్పారు.

సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో అరగేళ్ల శ్రీనివాసరావు (బున్నీ), మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తోట నవీన్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, న్యూటన్ ఆనంద్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జ్ మేక లక్ష్మణ్, ముమ్మడి వెంకటేశ్వర్లు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అంకమ్మరెడ్డి రామనాయుడు, బొబ్బిలి గోవింద్, కామడి దశరథ్, దేవ్ వెంకన్న, చీకట్ల వెంకటేష్, కోడి సీతారాం, రాయుడు దుర్గా, పాలిక సతీష్, పోలిశెట్టి తాతీలు, కృష్ణమూర్తి, బోడి వెంకట్, గింజాల శ్రీనివాసరావు, పలివెళ్ల సతీష్, జార్జ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, పేదలు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 19**:వాడపల్లి చందన స్వరూపుడువేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో నమోదైంది. బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ప్రధాన హుండీలు, శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా 1,81,93,365, అన్నప్రసాదం హుండీల ద్వారా 1,16,02,625 నగదు లభించింది. దీంతో మొత్తం హుండీ ఆదాయం 2,97,95,990గా నమోదైంది.గతంలో ఒక రోజు హుండీ ద్వారా వచ్చిన ఆదాయం 7,93,823 కాగా, ప్రస్తుత లెక్కింపులో ఒక రోజు ఆదాయం 8,51,314కు చేరింది. దీంతో భక్తుల కానుకల ద్వారా ఆలయానికి లభిస్తున్న ఆదాయంలో గణనీయమైన పెరుగుదల నమోదైనట్లు ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు వెల్లడించారు.హుండీల్లో నగదుతో పాటు 18 గ్రాముల 900 మిల్లీగ్రాముల బంగారం, 1 కిలో 24 గ్రాముల వెండి కూడా లభించింది. అదేవిధంగా 15 దేశాలకు చెందిన 84 విదేశీ కరెన్సీ నోట్లు భక్తుల కానుకలుగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. అమెరికా డాలర్లు, కువైట్ దినార్లు, కెనడా డాలర్లు, బ్రిటన్ పౌండ్లు, సౌదీ రియాల్స్, ఒమన్ రియాల్స్, ఖతార్ రియాల్స్, సింగపూర్ డాలర్లు, చైనా యువాన్, కొరియా వోన్, ఇండోనేషియా రూపియాలు, కజకిస్థాన్ టెంగే తదితర విదేశీ కరెన్సీలు ఇందులో ఉన్నాయి.హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థాన ధర్మకర్తలు సిహెచ్. సత్యనారాయణ, ఎం. త్రిమూర్తులు, ఎస్. సూర్య కుటుంబరావు, వి. సుందర శేషావతారం (అర్చకులు) పర్యవేక్షించారు.పర్యవేక్షణాధికారులుగా అమలాపురం అసిస్టెంట్ కమిషనర్, జిల్లా దేవదాయ శాఖ అధికారి వి. సత్యనారాయణ, రాజమండ్రి తనిఖీదారు ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, ఈఓ గ్రేడ్-××× బి. కిరణ్, ఈఓ గ్రేడ్-××× ఎం. శివరామకృష్ణ తదితరులుపాల్గొన్నారు.అర్చకస్వాములు, వేదపండితులు, గ్రామస్థులు, పోలీసు సిబ్బంది, పత్రికా ప్రతినిధులు, శ్రీవారి సేవకులు, ఎణఖీజ బ్యాంకు రావులపాలెం సిబ్బంది, దేవస్థానం సిబ్బంది హుండీ లెక్కింపు ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఒక్కరోజులోనే దాదాపు రూ.3 కోట్లకు చేరువైన హుండీ ఆదాయం రావడం విశేషంగా నిలిచింది. భక్తుల విశ్వాసానికి, ఆలయంపై ఉన్న ఆదరణకు ఈ స్థాయి కానుకలు నిదర్శనమని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమరశంఖం పూరించాలి





### పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి

### వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 19:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. రామచంద్రపురంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త చిత్తశుద్ధితో, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి కుటుంబాన్ని కలిసి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్న ఆయన.. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, వాటి ఫలాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి పార్టీకి మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రారంభించాలని అన్నారు. ప్రతి బూత్‌ను బలోపేతం చేసి ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకత్వం ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు.పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ, రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి, కె.గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్ తదితరులు మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.


ఈ కార్యక్రమంలో డీసీలు, క్లస్టర్, కో-క్లస్టర్, సొసైటీ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,యూనిట్,బూత్ స్థాయి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

## 36 వార్డులతో మండపేటకు కొత్తరూపు



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 19.**మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న 30 వార్డులను 36 వార్డులుగా పునర్విభజిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు మండపేట పురపాలక సంఘం అధికారులు సమర్పించిన వార్డుల పునర్విభజన ప్రతిపాదనలకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం లభించింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గెజిట్‌లో మండపేట పురపాలక సంఘంలోని 36 వార్డుల సరిహద్దులతో కూడిన నోటిఫికేషన్ వెలువడింది. నూతన వార్డుల సరిహద్దులకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రజలు తెలుసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో నోటీసు బోర్డుతో పాటు తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, శాఖా గ్రంథాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఇకపై 36 వార్డులు ఉండనున్న నేపథ్యంలో కొత్త వార్డుల సరిహద్దుల వివరాలను ప్రజలు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు.

## బీసీల రిజర్వేషన్ల పెంపుపై కోన హర్షం



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 19:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జాతీయ బీసీసంఘం క్రమశిక్షణ చైర్మన్ కోనసత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీసీల తరపున కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాబోయే స్దానిక సంస్థలనుండి రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచే ఈ నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కల్పించే దిశగా డబల్ ఇంజన్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను అమల్లోకి తీసుకువచ్చిన విషయం గుర్తు చేశారు. గతంలో ఎన్టీఆర్ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేస్తే, ఇప్పుడు కూటమిలో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల రిజర్వేషన్ కోటాను 34 శాతానికి పెంచడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు అధిక ప్రాతినిధ్యం లభించడం ద్వారా గ్రామస్థాయి నుంచి బీసీలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులుగా బీసీలు పెరగడంతో సమస్యలను పాలనలో మరింత సమర్థవంతంగా ప్రస్తావించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి మరింత భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని బీసీల అండగా ఉన్నారని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా. సామాజిక న్యాయం లో భాగంగా బీసీలకు రాజకీయంగా, బీసీలకు అవకాశం కల్పించిన డబుల్ ఇంజన్ సర్కారుకు కోన కృతజ్ఞతలు తెలిపారు .

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ

**విజయవాడ, ఆగస్టు 19, పెన్ పవర్:**
ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం.వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుత్కు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది.పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దాని తర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం. ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. రాజస్థాన్ మూడో స్థానంలో ఉండగా.. గుజరాత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం. అయితే పారిశ్రామికంగా ఎంతో ముందు వరుసలో ఉండే పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే ఏపీ చాలా వేగంగా పెట్టుబడులను ఆకర్షించిందని అర్థం అవుతోంది.అయితే పెట్టుబడులను ఆకర్షించడంలో మాత్రం ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాత్ర ఉంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడం కోసం వీరు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. తరచూ విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు వెళ్లడం.. ఇలా చాలా రకాల ప్రయత్నాలు ఫలితమే పారిశ్రామిక పెట్టుబడుల సాధనలో రెండో స్థానం. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్,, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సిస్టం సమర్థవంతంగా పనిచేయడం వల్లే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. తొమ్మిదవ స్థానంలో ఉన్న ఏపీని రెండో స్థానంలో నిలపడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది..

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జోగి రమేష్ ఎపిసోడ్

# బతుకు జట్కాబండి సీరియల్

**విజయవాడ, ఆగస్టు 19, పెన్ పవర్:**
రాజకీయాల్లో మైకుల ముందు నిలబడి ప్రత్యర్థులపై ఊగిపోతూ బూతులు అందుకోవడంలో స్పెషలిస్టులు అయిన జోగి ఫ్యామిలీ కుటుంబసభ్యులు ఇప్పుడు సొంత ఇంటి పంచాయతీలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట్లో జరుగుతున్న తాజా పరిణామాలు ఇప్పుడు సరిగ్గా ఏదో టీవీ ఛానల్ బతుకు జట్కా బండి పంచాయితీని తలపిస్తున్నాయి. కొడుకు వైవాహిక జీవితం, కోడలితో వివాదాలు, కుటుంబ సమస్యలు మీడియాకెక్కడంతో.. ఆ కుటుంబం బయటకు వచ్చి తలెత్తుకోవడం కష్టంగా మారుతోంది.కుమారుడి ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత బలహీనతలు, కోడలు మేఘన చేసిన ఆరోపణలు ఇప్పటికే పబ్లిక్ డొమైన్లోకి వచ్చి బహిరంగ చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి అత్యంత సున్నితమైన వ్యక్తిగత సంక్షోభం ఎదురైనప్పుడు.. పరువు ప్రతిష్టలు ఉన్న కుటుంబాలు బాధితులతో చడీచప్పుడు కాకుండా సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని గుట్టుగా వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకోవడం సహజం. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయింది. నష్టనివారణ చర్యలు చేపట్టాల్సింది పోయి, ఆస్తిపాస్తులు, నగదు లావాదేవీలు, ఎదురు ఆరోపణల పేరిట రచ్చను మరింత పెద్దది చేసుకుంటూ కూర్చోవడం చూస్తుంటే కాలికి బురద అంటితే కడుక్కోవాల్సింది పోయి మొహం నిండా రాసుకున్నట్టు ఉందనే కామెంట్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి.డాది కిందట జోగి రమేష్ తన కుమారుడు రాజీవ్ కు సూర్యాపేటకు చెందిన మేఘనతో వివాహం చేయించారు. అయితే ఏడాది పాటు తనను కుటుంబ సభ్యులు ఇబ్బంది పెట్టారని మేఘన ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. పోలీసులు గృహహింస కింద కేసు నమోదు చేశారు. అయితే ఇటీవల ఇరు కుటుంబాలు కొంతమంది పెద్దలతో కలిసి సమావేశమైనట్లు తెలుస్తోంది. అయితే జోగి రాజీవ్ తన తల్లిదండ్రులను తప్పుపడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. తరుణ్ వైట్ వాష్ చేసి పెళ్లికి ఒప్పించారని ఆయన చెబుతుండగా.. మరోవైపు మేఘన తనకు ఏడాది పాటు నరకం చూపించారని.. చంపేందుకు ప్రయత్నించారంటూ ఆరోపించారు. అయితే ఇరు కుటుంబాల వారు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఎవరు తీసారో తెలియదు కానీ ఈ వీడియోలు మీడియాకు అందాయి. దీంతో సోషల్ మీడియా కూడా కూస్తుండగా.. ప్రధాన మీడియాలో సైతం కథనాలు వస్తున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా పని చేశారు జోగి రమేష్. రాజకీయంగా చాలా దూకుడుగా ఉండేవారు. ప్రత్యర్థులపై వ్యక్తిగతంగా విమర్శలు చేసేవారు. ఇప్పుడు ఆయన కుటుంబ వ్యవహారం బయటకు రావడంతో పెద్ద ట్రోలింగ్ అవుతోంది సోషల్ మీడియాలో.. అయితే కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసిన సమయంలో ఇదంతా రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్. అయితే ఇప్పుడు నేరుగా వారి మధ్య జరిగిన పంచాయితీ బయటకు రావడం.. అటు కుమారుడు సైతం తిరగబడటం... కోడలు తరుపు కుటుంబ సభ్యులు సైతం కార్నర్ చేస్తుండడంతో జోగి రమేష్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయితే గతంలో ఆయనతో పాటు కుమారుడు చేసిన వ్యాఖ్యలను జోడిస్తూ.. కర్మ రిటర్న్ అంటూ ఎక్కువ మంది వ్యాఖ్యానిస్తున్నారు.ఒకప్పుడు నియోజకవర్గంలో చక్రం తిప్పి, ప్రత్యర్థుల ఇళ్లపైకి దండయాత్రలు చేసిన డాంబికాలు ఇప్పుడు సొంత ఇంటి సమస్యను పరిష్కరించుకోలేని నిస్సహాయత ముందు తేలిపోయాయి. కోడలి కుటుంబం చేస్తున్న ఆరోపణలు, పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కడం, ప్రెస్ మీట్లలో పరస్పర నిందారోపణలు చేసుకోవడం వల్ల జోగి కుటుంబ పరువు బజారున పడటం తప్ప పైసా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారం ఉన్నప్పుడు చూపిన తెగింపు, రాజీకొచ్చే విషయంలో వివేకంగా మారకపోవడమే ఈ వ్యవహారాన్ని మరింత నవ్వులపాలు చేస్తోందిరాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే విమర్శల కంటే.. సొంత చేజేతులా రోడ్డున పడేసుకున్న పరువు వల్ల వెనుక నవ్వుకునే నవ్వులే ఎక్కువ చేటు తెస్తాయి. పోవాల్సిన పరువు ఇప్పటికే పోయింది, మిగిలిన కాస్త ఇజ్జత్ అయినా కాపాడుకోకపోతే ఈ'ఫ్యామిలీ డ్రామా ఎపిసోడ్లు మరింత నాని ప్రజల్లో జోగి ఫ్యామిలీని ఒక కమెడియన్ గ్రూప్గా మిగిల్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మీడియా కెమెరాల ముందు డ్రామాలు ఆపి, నలుగురిలో నవ్వులపాలు కాకుండా చాపకింద నీరులా ఈ వివాదానికి తెరదించకపోతే... జోగి వెనుక సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటూ నవ్వుకోవడం ఖాయం.

## భోగాపురంలో బాదుడే...బాదుడు

**విజయనగరం, ఆగస్టు 19, పెన్ పవర్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. నిన్నటి నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభం కాగా.. తొలిరోజు 26 విమాన సర్వీసులు నడిచాయి. అయితే తొలి రోజు ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. విశాఖ నగరం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ప్రతి రెండు గంటలకు ఒకసారి బస్సులు నడిచినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. పైగా భోగాపురంలో ఆర్టీసీ బస్సులను ఆపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయలేదు. ఇంకోవైపు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చార్జీల బాదుడు అధికంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమర్షియల్ వెహికల్ ఎంట్రీ, వెయిటింగ్ పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తుండడం వివాదాలకు దారితీస్తోంది. ఒక డ్రైవర్ విమానాశ్రయం సిబ్బందిని నిలదీస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులను తీసుకొచ్చాడు ఓ క్యాబ్ డ్రైవర్. అయితే ఆ డ్రైవర్ నుంచి సిబ్బంది ఏకంగా 600 రూపాయల కమర్షియల్ టాక్స్, వెయిటింగ్ ఛార్జ్ డిమాండ్ చేయడంతో డ్రైవర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రయాణికులను విమానాశ్రయంలో దించేందుకు 700 రూపాయలు తీసుకున్నానని.. కానీ విమానాశ్రయం లోపలికి ప్రవేశించగానే 600 రూపాయలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇది ఎంత మాత్రం న్యాయం కాదని.. నిబంధనల పేరుతో క్యాబ్ డ్రైవర్లను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో విపరీతంగా ట్రోల్ అవుతోంది.వాస్తవానికి విమానాశ్రయం డిస్ప్లే బోర్డు పై పొందుపరిచిన పార్కింగ్, వెయిటింగ్ ఫీజుల ను మాత్రమే తీసుకోవాలి. అయితే ఈ డిస్ప్లేలో సైతం భారీగా చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే తాము చెప్పినట్టుగా 600 రూపాయలు ఇవ్వాల్సిందేనని ఎయిర్పోర్ట్ సిబ్బంది డిమాండ్ చేయగా.. సదరు డ్రైవర్ మాత్రం ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనకు న్యాయం జరిగే వరకు కారును ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. ఉన్నతాధికారుల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలంటూ పట్టుపట్టాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గట్టి వాదన జరిగింది. పక్కనున్న వారు ఈ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విపరీతంగా వైరల్ అయింది.

# బయిటకొస్తున్న గ్రూప్ వన్ చిట్టా...



**కడప, ఆగస్టు 19, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో నిరుద్యోగ నియామకాల అంశం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, వైఎస్ఆర్సీపీ దీనిని ప్రధాన అస్త్రంగా చేసుకుని నిరసనలకు దిగుతోంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాల మూల్యాంకన అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించిన నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడటంతో వైఎస్ఆర్సీపీ ఇబ్బందుల్లో పడుతోంది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తీవ్రమైన ఉల్లంఘనలు, సీసీటీవీల తొలగింపు, నియమావళికి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులతో వ్యాల్యుయేషన్ చేయించడం, రావీ= స్లిప్పుల రీ-ప్రింటింగ్ వంటి అక్రమాలు జరిగినట్లు సిట్ విచారణలో ఆధారాలు లభించాయి. ఒక్క నిర్ణయం వెనుక నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, నిర్దిష్ట అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యవస్థీకృత ప్రణాళిక నడిచిందని ఫోరెన్సిక్ ఆధారాలు చెబుతున్నాయి.సాధారణంగా నంబర్-1 స్థాయి రిక్రూట్మెంట్ స్కామ్లలో ఏజెన్సీలు నిబంధనలు ఉల్లంఘించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు లేదా బోర్డు సభ్యుల పాత్రపై దృష్టి సారిస్తాయి. గ్రూప్-1 వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి మరియు సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలపై ఇప్పటికే విచారణ సాగింది. అయితే, ఎలాంటి పొలిటికల్ గ్రీన్ సిగ్నల్ లేకుండా అంత పెద్ద వ్యవస్థాత్మక మార్పులు, ఓఎంఆర్ షీట్ల ప్రైవేటీకరణ లాంటి చర్యలు జరగడం అసాధ్యమనే వాదన బలంగా ఉంది.కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక విభాగానికి సంబంధించిన రిక్రూట్మెంట్ లోపంగా చూడటం లేదు. వైఎస్ఆర్సీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం , నాటి ముఖ్య నాయకుల సూచనలతోనే ఈ నియామకాల నిబంధనల్లో మార్పులు చేశారన్న కోణంలో సాక్ష్యాధారాలు సేకరిస్తే, విచారణ రాజకీయ నేతల దాకా వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో సిఐడి దర్యాప్తులో ఐఏఎస్ అధికారులను ప్రశ్నించినప్పుడు కొందరు ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి ఒత్తిళ్ల వల్లే నిబంధనలు మార్చామని పరోక్షంగా చెప్పడం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ప్రస్తుత డీఎస్సీపై పోరాటం చేయడం ద్వారా నిరుద్యోగుల మద్దతు కూడగట్టాలని చూస్తున్న వైఎస్ఆర్సీపీ గ్రూప్-1 దర్యాప్తు ఒక పెద్ద అడ్డంకిగా మారింది. మా హయాంలో సుదర్శన చక్రంలా పారదర్శకంగా మార్చాం అని చెప్పుకుంటున్నా, హైకోర్టు ఆదేశాలు , సిట్ నివేదిక వైఎస్ఆర్సీపీ వాదనను బలహీనపరుస్తున్నాయి. ఈ కేసు తీవ్రతరం అయితే, ప్రతిపక్ష నాయకులు రాజకీయంగా మరింత రక్షణలోకి వెళ్లాల్సి వస్తుంది.ఈ నివేదిక ఆధారంగా కోర్టు ఇచ్చే ఆదేశాలు అత్యంత కీలకం కానున్నాయి. కేవలం అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మాత్రమే కాకుండా నాటి విధాన నిర్ణేతలు, ప్రభుత్వ సలహాదారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది వైఎస్ఆర్సీపీలోని అగ్రనాయకత్వానికి ఊహించని రాజకీయ ప్రతిబంధకంగా మారనుంది. ఏపీలో రాజకీయం ఇప్పుడు రిక్రూట్మెంట్లు, స్కామ్ల చుట్టూ తిరుగుతోంది. గ్రూప్-1 అక్రమాల బాధ్యతను అధికారులపై మాత్రమే నెట్టివేసి ముగిస్తారా లేక సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుందా అన్నది రాబోయే రోజుల్లో సిట్ ఇచ్చే తుది ఛార్జ్షీట్తో తేలనుంది.

# క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి



**విజయవాడ, నెల్లూరు, ఆగస్టు 19, పెన్ పవర్:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

**మండలిలో..**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్కు వైఎస్సార్సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది. అప్పటివరకు అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం నిరాటంకంగా ప్రతిపక్ష వైఫల్యాలను, గత ఐదేళ్ల పాలనా లోపాలను ఎండగడుతూనే ఉంటుంది. శాసనసభ రికార్డుల్లో నమోదయ్యే అధికారిక చర్చలకు ఉండే రాజ్యాంగబద్ధమైన విలువ, మీడియా పాయింట్ల వద్ద లేదా పార్టీ కార్యాలయాల్లో పెట్టే ప్రెస్ మీట్లకు ఎప్పటికీ ఉండదనే ప్రాథమిక పార్లమెంటరీ సూత్రాన్ని వైఎస్సార్సీపీ విస్మరించడం చర్చనీయాంశంగా మారింది.ప్రజాస్వామ్యంలో అధికార పక్షం తప్పులను ఎత్తిచూపేందుకు దక్కిన సంఖ్యాబలాన్ని సద్వినియోగం చేసుకోకుండా, కేవలం మైకు ఇవ్వలేదనో లేక ప్రతిపక్ష హోదా రాలేదనో సాకులు చెబుతూ సభా వేదికల నుంచి పారిపోవడం ప్రజల్లో మరింత చులకన భావాన్ని పెంచుతుంది. ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా పోస్టులతో కేవలం తమ సొంత కేడర్ను మాత్రమే సంతృప్తిపరచగలరు తప్ప, శాసనసభ వేదికగా ప్రజలకు జవాబుదారీతనాన్ని చాటుకోలేరు. ఈ పార్లమెంటరీ వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకోకపోతే ప్రతిపక్షంగా వైఎస్సార్సీపీ రాజకీయ మనుగడ మరింత క్లిష్టతరంగా మారే ప్రమాదం ఉంది

## పాకిస్థాన్ , ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు రంగం సిద్ధం..

## పూర్తి షెడ్యూల్, జట్లు, లైవ్ స్ట్రీమింగ్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ టూర్ లో భాగంగా 3 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 19 నుంచి 23 వరకు లీడ్స్‌లోని హెడింగ్లే వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ ఆగస్టు 27 నుంచి 31 వరకు చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో, మూడో టెస్ట్ సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనుంది. జూన్ 2027లో ది ఓవల్‌లో జరగబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో టాప్-2లో నిలవాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్ గెలవడం అత్యంత కీలకంగా మారింది.

బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత ఇంగ్లాండ్ ఆడుతున్న తొలి రెడ్-బాల్ సిరీస్ ఇది. ఈ సిరీస్ కోసం జో రూట్ తిరిగి ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. తొలి రెండు టెస్టుల కోసం డ్యాన్ లారెన్స్, మాజీ వైస్ కెప్టెన్ ఆలీ పోప్ జట్టులోకి పునరాగమనం చేయగా, గాయం కారణంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొలి రెండు టెస్టులకు ప్రకటించారు.

### పాకిస్థాన్‌కు కెప్టెన్ గాయం టెన్షన్..

### అఫ్రిది ఔట్:

మరోవైపు పాకిస్థాన్ జట్టు బాబర్ అజామ్ సారథ్యంలో బరిలోకి దిగుతోంది. జూలై 2026లో షాన్ మసూద్ స్థానంలో బాబర్ టెస్ట్ కెప్టెన్సీ చేపట్టినప్పటికీ, వేలి గాయం కారణంగా లీడ్స్‌లో జరిగే తొలి టెస్టుకు అతను ఆడటం అనుమానంగా మారింది. ఇక స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదిని ఈ పర్యటనకు ఎంపిక చేయకపోవడంతో సీనియర్ బౌలర్ మహమ్మద్ అబ్బాస్ పాక్ పేస్ విభాగాన్ని నడిపించనున్నాడు.

### లైవ్ స్ట్రీమింగ్ వివరాలు


భారతదేశంలో ఈ ఇంగ్లాండ్ వర్సెస్ పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ (ాశీఅం ాజూశీ‌ీం చీవ్‌షశీ‌ీఎ) టీవీ ఛానెళ్లలో ప్రత్యక్షంగా చూడవచ్చు.. అలాగే డిజిటల్ వీక్షకులు సోనీ లివ్ (ాశీఅం ా×ం) యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా మ్యాచ్‌లను వీక్షించవచ్చు. తొలి టెస్ట్ మ్యాచ్ ప్రతిరోజు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమవుతుంది.

### ఇరు జట్లు:

పాకిస్థాన్ జట్టు: బాబర్ అజామ్ (కెప్టెన్), షాన్ మసూద్, అబ్దుల్లా షఫీక్, అజాన్ అవాయిస్, ఇమామ్-ఉల్-హక్, ముహమ్మద్ అవాయిస్ జాఫర్, మహమ్మద్ రిజ్వాన్ (కీపర్), ముహమ్మద్ ఘాజీ ఘోరీ (కీపర్), అమీర్ జమాల్, సల్మాన్ అలీ ఆగా, సౌద్ షకీల్, అలీ ఉస్మాన్, సాజిద్ ఖాన్, ఖుర్రం షెహజాద్, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ, ఉబైద్ షా

ఇంగ్లాండ్ జట్టు: జో రూట్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, బెన్ డకెట్, మాథ్యూ ఫిషర్, ఎమిలియో గే, డ్యాన్ లారెన్స్, ఆలీ పోప్, ఆలీ రాబిన్సన్, జేమీ స్మిత్, జోష్ టంగ్

## డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్.. టెన్నిస్ నుంచి నిక్ కిర్గియోస్ సస్పెండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నంబర్ 13 నిక్ కిర్గియోస్ నిషేధిత డ్రగ్స్ వాడుతూ దొరికిపోవడంతో క్రీడా ప్రపంచంలో తీవ్ర కలకలం రేపుతుంది. ఇటీవల నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో అతను డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడంతో ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ అతనిపై సడన్‌గా ప్రొవిజనల్ బ్యాన్ విధించింది. జూన్ 22న జరిగిన మల్లోర్కా ఓపెన్ టోర్నీ సందర్భంగా నిక్ కిర్గియోస్‌కు డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో అతను కొకైన్ వాడినట్లు నిర్ధారణ కావడంతో ఆగస్టు 4వ తేదీన అతనిపై తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సస్పెన్షన్ అమలులో ఉన్నంత వరకు అతను గ్రాండ్‌స్లామ్‌లు సహా ఎలాంటి ప్రొఫెషనల్ టెన్నిస్ టోర్నమెంట్లలో ఆడటానికి, కోచింగ్ ఇవ్వడానికి లేదా చివరికి మ్యాచ్‌లకు హాజరవడానికి కూడా పర్మిషన్ ఉండదు. ఈ షాకింగ్ న్యూస్ బయటకు రాగానే నిక్ కిర్గియోస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ.. తన తప్పును బహిరంగంగా ఒప్పుకున్నాడు. నేను ఒక విపరీతమైన పెద్ద తప్పు చేశాను, దానికి పూర్తి బాధ్యత నాదే.. నా అభిమానులు, కుటుంబం, స్పాన్సర్లు, ముఖ్యంగా నన్ను రోల్ మోడల్‌గా భావించే పిల్లలకి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. నావల్ల ఇలాంటి రాంగ్ ఎగ్జాంపుల్ సెట్ అయినందుకు నా మీద నాకే చాలా నిరాశగా ఉందంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు.

### డిప్రెషన్ పై మనసు విప్పిన టెన్నిస్ స్టార్:

తన పరిస్థితికి గల కారణాలను వివరిస్తూ.. గడిచిన రెండేళ్లుగా మోకాలు, మణికట్టు గాయాలతో శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యానని చెప్పాడు. మైండ్ అనుకున్నట్లు శరీరం సహకరించకపోవడంతో, కెరీర్ ముగింపునకు వచ్చేసిందనే ఘోరమైన సత్యాన్ని తట్టుకోలేక చాలా ఒంటరిగా, నిస్సహాయంగా ఫీల్ అయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ తప్పును సరిదిద్దుకోవడానికి రాబోయే 28 రోజుల పాటు సోషల్ మీడియాకు, పబ్లిక్ లైఫ్‌కు దూరంగా ఉంటానని ప్రకటించాడు.

### డేంజర్‌లో పడిన ప్రొఫెషనల్ కెరీర్:

గాయాల సమస్యల వల్ల ఈ సీజన్‌లో కేవలం నాలుగు సింగిల్స్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన 31 ఏళ్ల నిక్ కిర్గియోస్, చివరిగా వింబుల్డన్ డబుల్స్‌లో ఆడి ఫస్ట్ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఇప్పుడు ఈ కొకైన్ రచ్చతో అతని ప్రొఫెషనల్ కెరీర్ మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తప్పును రియలైజ్ అయి బ్రేక్ తీసుకుంటున్న కిర్గియోస్, మళ్లీ లైఫ్‌ను ట్రాక్‌లోకి తెచ్చుకుని ఎంతవరకు స్ట్రాంగ్‌గా కంబ్యాక్ ఇస్తాడో లేదో అనేది వేచి చూడాల్సింది.

## శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర.. దిగ్గజాల రికార్డులు బ్రేక్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

### మ్యాచ్ సాగిందిలా..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### సుతార్ స్పిన్ మ్యాజిక్

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.



స్టైలిష్ గ్రే క్రాప్ టాప్ లుక్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్న ప్రియాంక ఖోల్గాడే

## ట్రెండ్‌గా మారుతున్న జాంబీ సినిమాలు!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చిత్ర పరిశ్రమలో ఎప్పటికప్పుడు కొత్త జోనర్స్ తెరపైకి వస్తున్నాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి దర్శకులు విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కోవలోనే కొన్ని సంవత్సరాల క్రితం టాలీవుడ్‌లో ప్రశాంత్ వర్మ అద్భుతమైన సృజనాత్మకతతో తెరకెక్కించిన -జాంబీ రెడ్డి- సినిమాతో హర్రర్-కామెడీ జాంబీ కాన్సెప్ట్ అధికారికంగా పరిచయమైంది. తెలుగు ప్రేక్షకులకు పూర్తిగా కొత్తనైన జానర్‌ను దర్శకుడు అత్యంత వినోదాత్మకంగా మలచడంతో ఈ ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. -జాంబీ రెడ్డి- సృష్టించిన ట్రెండ్ ఒక చిత్రంతో ఆగిపోకుండా ఇండియన్ స్క్రీన్ మీద సరికొత్త ట్రెండ్‌గా వేగంగా మారుతోంది. భయంతో పాటు కడుపుబ్బా నవించే కామెడీని మిక్స్ చేసి తెరకెక్కించే జాంబీ జోనర్‌పై నేటి యువ ప్రేక్షకులు మంచి ఆసక్తి చూపిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితం అనుకున్న జాంబీ కాన్సెప్ట్‌ను భారతీయ నైటివిటీకి తగ్గట్టుగా మార్చి తెరపై ఆవిష్కరిస్తుండటంతో మేకర్స్‌కు కూడా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి.ఈ విజయవంతమైన బాటలోనే ఇప్పుడు మరిన్ని భారీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాయి. -జాంబీ రెడ్డి- చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న -జాంబీ రెడ్డి 2-పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఈసారి మరింత విస్తృతమైన గ్రాఫిక్స్ .. వినోదంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం కంటే రెండవ భాగం మరింత వైవిధ్యంగా ఉంటుందని ప్రేక్షకులను సీట్లలో కూర్చోబెట్టేలా అదిరిపోయే హర్రర్-కామెడీ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది.ఇక బాలీవుడ్‌లోనూ జాంబీ జోనర్ జోరు భారీగా పెరిగింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -ప్రళయ్- కూడా ఇదే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో ఈ జోనర్‌లో నటిస్తుండటంతో సినిమాపై జాతీయ స్థాయిలో భారీ హైప్ క్రియేట్ అవుతుంది.మరోవైపు కోలీవుడ్‌లోనూ ఈ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుదేవా .. నవ్వుల రారాజు వడివేలు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న -బ్యాంగ్ బ్యాంగ్- సినిమా కూడా జాంబీ కామెడీ నేపథ్యంలోనే రూపొందుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హర్రర్-కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు అంతులేని నవ్వులను పంచడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకరికొకరు పూర్తిగా భిన్నమైన శైలి కలిగిన ఇద్దరు దిగ్గజాలు జాంబీలతో చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం పక్కా.మొత్తంగా ప్రశాంత్ వర్మ విత్తిన జాంబీ రెడ్డి చిన్న మొక్క నేడు ఇండియన్ సినిమా పరిశ్రమలో పెద్ద వృక్షలా ఎదిగుతోందన్నది కాదనలేని నిజం. రొటీన్ లవ్‌స్టోరీలు, యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఇలాంటి ప్రయోగాత్మక జాంబీ కాన్సెప్ట్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుండటం శుభపరిణామం. రాబోయే రోజుల్లో భారతీయ తెరపై జాంబీ సినిమాల జోరు మరింత పెరిగి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.



సాంప్రదాయక రూపంలో శ్రియా శరణ్ కాలాతీతమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com